క్లుప్తంగా

రేపు చలో హైదరాబాద్

కందుకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి అంగన్‌వాడీలు, ఆశలు, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులు, వీఓఏలు, ఆటో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేఎల్లార్

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ జాతర ఉత్సవాల వాల్ పోస్టర్‌ను శనివారం మాజీ కౌన్సిలర్ యాదగిరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఉత్సవాలకు రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, మన్న రవికుమార్, నర్సింహ, యూసుఫ్ ఖాద్రీ, ముక్రం అలీ, కిశోర్, దిలీప్ గౌడ్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర సాంబమూర్తి సేవలు మరువలేనివి

వనస్థలిపురం: నాటకాలు, రంగస్థల కళాకారుల కోసం దర్శక విశారద ఆంధ్ర సాంబమూర్తి చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో ఆంధ్ర సాంబమూర్తి జయంతిని శుక్రవారం రాత్రి ఎన్జీవోస్‌కాలనీలోని శ్రీ గణేష్ దేవాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సత్కరించారు. అనంతరం నిజాంపేట రామకృష్ణ నాట్యమండలి ప్రదర్శించిన భక్త చింతామణి, విజయవాడ బృందం వారు ప్రదర్శించిన దామోదర నీతి బోధ ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, కృష్ణమూర్తి, ఎం.ఎస్.కే.ప్రభు, గోపాల్‌రావు, హనుమంతరావు, సోమయాజులు, ఉదయ్‌కుమార్, సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి, సూర్యప్రకాష్, శ్రవణ్ కుమార్, శేషాచలపతి, కామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

హస్తినాపురం: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పర్యటించి కాలనీల వాసులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లోని ప్రజలకు కనీస వసతులైన మంచినీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమతా మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నియామకం

దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేటకు చెందిన ముడావత్ గోవింద్‌ను నియమించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆయన నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పార్టీ అభివృద్ధి-సంక్షేమమే అజెండాగా పని చేస్తుందన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.38, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.15, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.29, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.19, సొరకాయ రూ09, చిక్కుడుకాయ రూ.35, చామగడ్డ రూ.28, మునగ రూ.70, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.15, కీర రూ.23, బీన్స్ రూ.35, క్యాప్సికమ్ రూ.35.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హస్తినాపురం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీ నివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి మోసపోవద్దన్నారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించిన నేరమన్నారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి

బీజేపీతోనే రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కాషాయం జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తంచేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారం కైవసం చేసుకోవడంతో నియోజకవర్గ పరిధి ప్రాంతాల్లో కమలనాథులు సంబురాలు చేసుకున్నారు.

- అవినీతి పార్టీలకు ఢిల్లీలో చుక్కెదురు
- కమలానికి పట్టం కట్టిన హస్తిన ప్రజలు: బీజేపీ
- నియోజకవర్గంలో కాషాయ నేతల సంబురాలు


కందుకూరు: సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు


తుక్కుగూడలో..


బడంగ్‌పేట్‌లో..

కందుకూరు: సుదీర్ఘ కాలం అనంతరం దేశ రాజధాని హస్తినలో బీజేపీ జెండా ఎగరవేయడం సంతోషకరమైన విషయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అన్నారు. ఢిల్లీలో కాషాయం పార్టీ అధికారం చేపట్టిన నేపథ్యంలో శనివారం కందుకూరు చౌరస్తాలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరగనున్న స్థానిక ఎన్నికల్లోనూ బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, జంగారెడ్డి, మంద పాండు, అంబటి యాదగిరి, మల్లేశ్, సత్తయ్య, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, వీర కర్ణారెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ కూడలిలో బాణాసంచాలు కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలను ఓటర్లు చీపురుతో ఊడ్చి, బీజేపీకి పట్టం కట్టారని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కాషాయం జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు నడికుడి యాదగిరి, ఏనుగు రాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, కొంతం సంపత్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, గూడెపు ఇంద్రసేన, చిత్రం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. శ్రీశైలం జాతీయ రహదారిపై బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షురాలు బరిగేల హేమలత, నాయకులు రచ్చ లక్ష్మణ్, రాజు, అశోక్, దేవేందర్, సుధాకర్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి


పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి, ప్రజాసంఘాల నేతలు

- పాఠశాల ఎదుట రెండో రోజూ కొనసాగిన ఆందోళన
- చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం తగదని ఆగ్రహం

శంషాబాద్: ఒకటో తరగతి బాలికపట్ల బస్సు డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై శనివారం కూడా పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాల ఎదుట ప్రజాసంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. సంఘటనకు స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్లు కూడా కారణమేనని వారిపై కూడా కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల వైఖరి కారణంగా ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలలో ఇలాంటి సంఘటన చోటు చేసుకుందన్నారు. గతంలో కూడా పాఠశాల యాజమాన్యంపై జిల్లా విద్యాధికారి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. చిన్నారులను పాఠశాలకు పంపాలంటేనే భయం వేస్తుందని పలువురు తల్లిదండ్రులు కూడా ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

నిందితులపై చర్యలు తథ్యం...

పాఠశాలకు సంబంధించిన యాజమాన్యంపై ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించామని ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపారు. కేసు మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండటంతో బాధితుల ఫిర్యాదును అక్కడికి పంపనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిందితుడు మంచాల పోలీసుల అదుపులో ఉన్నట్లు చెప్పారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందన్నారు. నిందితులు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు

హుడాకాంప్లెక్స్: నేచర్ క్యూర్ విధానంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శ్రీ షిర్డీ సాయి అష్టాంగ యోగా శిక్షణ కేంద్రం గురూజి ఇస్మాయిల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9 నుంచి 18 వరకు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని లోటస్ ల్యాప్ ప్లే స్కూల్ గ్రౌండ్‌లో ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాయామాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానం, ఆసనాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిప్తామని పేర్కొన్నారు. తరగతులకు హాజరైన ధ్యానులకు అమృత ఆహారం అందిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9603256572, 8121410911 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి జాతర

మంచాల: మండల పరిధి ఆరుట్ల గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. తొలి రోజు ఆదివారం ఉదయం 7 గంటలకు కలశ స్థాపన అంకురార్పణ, సాయంత్రం 5 గంటలకు అధివాస హోమం నిర్వహించనున్నారు. రోజువారి వివరాలు ఇలా ఉన్నాయి. 10న ఉదయం 7.45 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి హోమం. మంగళవారం రాత్రి 8.30 గంటలకు స్వామి వారి కల్యాణం. 12న హోమం, 13న ఉదయం 6.30 గంటలకు స్వామివారి రథోత్సవం. 14న ఉదయం 7.30 గంటలకు హోమం, సాయంత్రం 5.30 గంటలకు నాగవల్లి కార్యక్రమం. రథోత్సవం రోజున స్వామివారి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి పాటలు, కోలాట ఆటలు ప్రదర్శించనున్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునుగనూరులో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంకటాద్రిగా పిలువబడే ఈ కొండపై ఉన్న విశాలమైన స్థలంలో ఆలయాన్ని నిర్మించి, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, మాజీ వైస్ ఎంపీపీ యాదిరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకా మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరచారి తదితరులు పాల్గొన్నారు.

అపార్‌కు ఆధార్ కష్టాలు

- ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డు
- వన్‌నేషన్, వన్‌ఐడీని ప్రవేశ పెట్టిన కేంద్రం
- నమోదు కాని ఆధార్ వివరాలు


రావిర్యాల ఆధార్ నమోదు కేంద్రం వద్ద విద్యార్థుల పడిగాపులు

తుక్కుగూడ: ఆధార్ కార్డు తరహాలో ఒకే నంబర్‌తో అపార్ కార్డును కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తోంది. దీంతో దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎల్‌కేజీ నుంచి పీజీ ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారందరికీ శాశ్వత సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డు ఇవ్వనుంది. ప్రస్తుత ఆధార్ తరహాలో వన్ నేషన్- వన్ ఐడీ పేరుతో 17 అంకెల గల అపార్ కార్డును అందుబాటులోకి కేంద్రం తీసుకురానుంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి విద్యా సంస్థలో అపార్ నమోదు ప్రక్రియను గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించారు. అపార్ నంబర్ కోసం ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల హెచ్‌ఎంకు దరఖాస్తు చేసుకోవాలి. కానీ జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌లోని కొన్ని వివరాలకు పొంతన లేకపోవడంతో విద్యార్థులు, వారి పెద్దలు మీ సేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మందకొడిగా ఆన్‌లైన్..

అపార్ నమోదును పాఠశాల యాజ్యమానం ఆన్‌లైన్‌లో యూడైస్‌లో విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలు తరగతి, పుట్టిన తేది, ఆధార్ నంబర్, తల్లిదండ్రులు తదితర వివరాలను నమోదు చేయాలి. అపార్ నంబర్‌ను విద్యార్థికి టీసీ ఇచ్చే సయమంలో రాయాలి. విద్యార్థులకు ఆధార్ కార్డులో పూర్తి వివరాలు లేక పోవడం, పుట్టిన తేది, ఇంటి పేరు పూర్తి స్థాయిలో లేక పోవడం, సరైన ఇంటి చిరునామ, తెలంగాణ రాష్ట్ర ఆధార్ కార్డు లేక పోవడంతో ఇలా ఏది తప్పు ఉన్నా ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు.

55 శాతం పూర్తి

మహేశ్వరం మండలంలో 59 ప్రభుత్వ, 33 ప్రైవేటు విద్యాసంస్థల్లో 20,136 మంది చదువుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు 11,267 మంది విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా 9,549 విద్యార్థుల వివరాలు.. ఆధార్‌లో తప్పులు, అడ్మిషన్ రికార్డులో తప్పులు తదితర కారణాలతో నమోదు కావడం లేదు. ఇప్పటి వరకు 55 శాతం మేరకు పూర్తి చేశారు.

ఆధార్ కేంద్రాలకు పరుగు

ఆధార్ కార్డులో తప్పులు ఉండటం వలన విద్యార్థుల వివరాలు యూడైస్‌లో నమోదు కావడం లేదు. దీంతో విద్యార్థులు పాఠశాలను విడిచి ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో పరిమితంగా ఆధార్ నమోదు కేంద్రాలు ఉండటం, వాటి వద్ద జనాల సంఖ్య ఎక్కువగా ఉండటం వలన విద్యార్థులు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రోజులు తరబడి, కష్టపడి ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకుంటున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం

విద్యార్థుల ఆధార్, అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లో వివరాల తప్పుల కారణంగా అపార్ ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. నిత్యం ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది. మిగతా విద్యార్థులు తమ పత్రాలను సరి చేసుకుంటున్నారు. ఈ నెలాఖరు వరకు వంద శాతం ఆన్‌లైన్ చేస్తాం.

– కస్నా నాయక్, ఎంఈఓ, మహేశ్వరం

మీ బస్తీకే దవాఖానాలు

ఎమ్మెల్యే సబితారెడ్డి



దవాఖానా ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ఖరీదైన వైద్యం ఎలా అని చింత చెందకుండా.. మీకు ఉచితంగా సకాలంలో వైద్యం అందించేందుకు బస్తీ దవాఖానాలు అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ప్రజలు ఆస్పత్రిని వినియోగించుకోవాలని సూచించారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ అల్మాస్‌గూడ 25వ డివిజన్‌లో బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదలకు జబ్బు చేస్తే వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్నారని, అందరు ఆరోగ్యంగా ఉండాలనే ఈ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో బస్తీ దవాఖానాలు, 8 అర్బన్ హెల్త్ సెంటర్లు తీసుకువచ్చామని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్, బస్తీ దవాఖానా జిల్లా ఇన్‌చార్జి వినోద్‌కుమార్, డాక్టర్ గీత, బాలాపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలమణి, మాజీ కార్పొరేటర్ ముత్యాల లలిత, డాక్టర్ గాయత్రి, డాక్టర్ అఖిల, డీపీఎంఓ అక్రమ్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఏనుగు రాంరెడ్డి ఇతరులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు సరైన ఎంపిక భారతి సిమెంట్

సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ



తాపీ మేస్త్రీలతో మాట్లాడుతున్న ఇంజినీర్ బద్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: నిర్మాణ రంగంలో భారతి సిమెంటుకు తిరుగులేదని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ బద్రీ తెలిపారు. తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న సంస్థ.. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో శుక్రవారం రాత్రి ముత్యం సిమెంట్, స్టీల్స్ డీలర్ దుకాణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తాపీ మేస్త్రీలతో బద్రీ మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక న్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రిట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వెల్లడించారు. భారతి అల్ట్రాఫాస్ట్‌కు రూ.20 అధికంగా ఉంటుందన్నారు. డీలర్స్ మల్లికార్జున్ రెడ్డి, రవి, అనీల్‌రెడ్డిలు మాట్లాడుతూ భారతి సిమెంట్ సర్వీస్ చాలా వేగంగా ఉందన్నారు. సమావేశంలో సంస్థ మార్కెటింగ్ విభాగం డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, 60మందికి పైగా తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో బ్రహ్మోత్సవాలు షురూ

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ నిర్వాహకులు మెట్లూరి వెంకటేశ్వరశర్మ నేతృత్వంలో విశ్వక్ సేనపూజ, అంకురార్పణ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మార్కెట్ చైర్మన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు జీఏల్‌ఎన్‌రెడ్డి, వేణుగోపాల్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సమీక్ష నేడు

యాచారం: బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మండల కేంద్రంలో జరగనుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమీక్షకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డిలు హాజరవుతారని, మండల పరిధి పార్టీ శ్రేణులు అందరూ రావాలని ఆయన కోరారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మహేశ్

ఆమనగల్లు: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గ మహేశ్ అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, స్నేహభావంతో ఆడి, క్రీడాస్ఫూర్తిని నింపాలని సూచించారు. అంతకు ముందు క్రీడాకారులకు డ్రెస్సులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎనుమల రమేశ్, పవన్‌కుమార్, మహేందర్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఆర్గనైజర్లు జగన్, మనోహర్‌రెడ్డి, రాజు, రవి, చాంద్‌పాషా, సురేశ్, పవన్, గోపి, సందీప్, ఎంఈఓ పాండు, ఉపాధ్యాయులు దూసకంటి శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు


హోమం చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల శ్రీ వేదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన ధర్మకర్త గూడ యాదగిరి నృసింహశర్మ, నిర్వాహకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌యాదవ్, నిర్మల, మాజీ సర్పంచ్ సంగీత, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబుర్ రెహ్మాన్, నాయకులు అంబాజి, విష్ణువర్ధన్ యాదవ్, నరేందర్‌గౌడ్, యాదయ్య, రాజుగుప్తా, మోహన్‌రెడ్డి, సంపత్, శ్రీశైలం, శేఖర్, ఆంజనేయులు, లింగం తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను సవరించాలి

యాచారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. పేద ప్రజలకు అన్యాయం చేసే విధంగా ఉందని, వెంటనే సవరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ డిమాండ్ చేవారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న నగరంలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మంతన్‌గౌరెల్లి గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తలకు మేలు చేసే విధంగా ఉందని ఆరోపించారు. పద్దును సవరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తావునాయక్, చందునాయక్, శ్రీరాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ఆమనగల్లు: మున్సిపల్ పరిధి విఠాయిపల్లి గ్రామానికి చెందిన ప్రభావతికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి పథకం కింద రూ.39 వేల చెక్కు మంజూరు అయింది. శనివారం ఆమెకు మాజీ సర్పంచ్ పర్వతాలు, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌నాయక్, కృష్ణ, రవీందర్, సంజీవ్, శంకర్ పాల్గొన్నారు.